వేగుచుక్క
నీతికి నిజాయితీకి నిలువుటద్దం

## రానున్నమూడ్రోజులు భారీ వర్షాలు

హైదరాబాద్:రానున్న మూడు రోజుల్లో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో అతి భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ శాఖ తెలంగాణ ప్రజలకు హెచ్చరికలు జారీ చేసింది. ఈ సంవత్సరం ముందుగానే వర్షాకాలం వచ్చింది. గత కొద్దిరోజుల నుంచి దేశ వ్యాప్తంగా వర్షాలు దంచి కొడుతున్నాయి. ప్రజలకు చుక్కలు చూపిస్తున్నాయి. ఇక, తెలుగు రాష్ట్రాల్లోనూ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. 27,28,29 తేదీల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఉత్తర తెలంగాణపై ద్రోణి కొనసాగుతున్న నేపథ్యంలో సోమవారం నుంచి గురువారం వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు- వాతావరణ శాఖ తెలిపింది. ఉమ్మడి ఆదిలాబాద్, నిజమాబాద్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లో పలుచోట్ల భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది.సోమవారం వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో భారీ వర్షాలు కురుసే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. మంగళవారం పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశముందని తెలిపింది. ఈ అల్పపీడనం కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు రోజులు వర్షాలు పడతాయని వెల్లడించింది. అంతేకాదు.. ఈ నెల 27వ తేదీన ఉత్తర బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని స్పష్టం చేసింది. 29వ తేదీలోగా అల్పపీడనం బలపడే సూచనలు ఉన్నాయని పేర్కొంది. ఈ నేపథ్యంలో మే చివరి వారంలో దక్షిణ భారత దేశంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అంది. ఆంధ్రప్రదేశ్ మీద ఈ అల్పపీడన ప్రభావం పడనుంది. ఇక, మే 26, 27, 28, 29 తేదీల్లో ఏపీ రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావారణ శాఖ తెలిపింది. కోస్తాంధ్రలోని పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ఈ నేపథ్యంలోనే మహా నగరం హైదరాబాద్‌లో సోమవారం భారీ వర్షం కురిసింది. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఫిలింనగర్, గచ్చిబౌలి, హైటెక్ సిటీ, మాదాపూర్, మణికొండ, మెహిదీపట్నం, టోలిచౌకీ, మాసబ్‌ట్యాంక్, నాంపల్లిలో వర్షం పడింది.వర్షం కారణంగా ఐటీ కారిడార్‌లో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. ట్రాఫిక్ జామ్ కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇక, ఉత్తర తెలంగాణపై ద్రోణి కొనసాగుతున్న నేపథ్యంలో తెలంగాణలో సోమవారం నుంచి గురువారం వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు- వాతావరణ శాఖ తెలిపింది. ఉమ్మడి ఆదిలాబాద్, నిజమాబాద్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లో పలుచోట్ల భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది.

## వంశీకి వరుస షాక్‌లు

విజయవాడ: వైఎస్సార్ కాంగ్రెస పార్టీ నేత, గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి వరుసగా షాక్‌లు తగులుతున్నాయి.. ఇప్పటికే నకిలీ ఇళ్ల పట్టాల పంపిణీ కేసులో వల్లభనేని వంశీ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్ను నూజివీడు కోర్టు కొట్టివేసింది.. మరోవైపు.. వల్లభనేని వంశీని రెండోసారి కస్టడీకి కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు పోలీసులు.. నకిలీ ఇళ్ల పట్టాల పంపిణీ కేసులో వంశీని మూడు రోజులపాటు- కస్టడీకి ఇవ్వాలని కోరుతూ పోలీసులు తాజాగా పిటిషన్ వేశారు.. ఇప్పటికే ఇదే కేసులో
రెండు రోజుల పాటు వల్లభనేని వంశీని న్యాయస్థానం కస్టడీకి ఇచ్చింది.. అయితే, వంశీ సరిగా విచారణకు సహకరించక పోవటంతో మరోసారి కస్టడీకి ఇవ్వాలని కోరుతూ పోలీసులు మరోసారి కోర్టు మెట్లు ఎక్కారు.. అయితే, పోలీసుల పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన నూజివీడు కోర్టు.. తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేసింది.. కాగా, ఇప్పటికే పలు కేసుల్లో బెయిల్, ముందస్తు బెయిల్ పొందారు వల్లభనేని వంశీ.. కానీ, చివరల్లో నకిలీ ఇళ్ల పట్టాల పంపిణీ కేసులో కోర్టు వల్లభనేని వంశీపై పీటీ-వారెంట్‌కు అనుమతి ఇవ్వడంతో కథ అడ్డం దిరిగింది.. ఇక, నకిలీ ఇళ్ల పట్టాల కేసుకు సంబంధించి రిమాండ్‌లో ఉన్న వల్లభనేని వంశీ పలుమార్లు అస్వస్థతకు గురయ్యారు.. మెరుగైన చికిత్స నిమిత్తం ఆయన్ను పోలీసులు గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. శ్వాసకోశ సంబంధిత సమస్యలతో ఆయన ఇబ్బంది పడుతున్నట్లుగా తెలుస్తుండగా.. ఆసుపత్రిలో వైద్యుల పర్యవేక్షణలో చికిత్స అందించారు.. మరోవైపు.. ఈ విషయం తెలుసుకుని జీజీహెచ్‌కు చేరుకున్న వల్లభనేని వంశీ భార్య పంకజశ్రీని.. వంశీని కలిసేందుకు పోలీసులు అనుమతించలేదు.. దీంతో, ఆమె పోలీసులతో వాగ్వాదానికి దిగారు.మరోవైపు.. నూజివీడు కోర్టులో వల్లభనేని వంశీకి చుక్కెదురైంది. వంశీ మోహన్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను కొట్టివేసింది. నకిలీ ఇళ్ల పట్టాల పంపిణీ కేసులో బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు వల్లభనేని వంశీ.. అయితే, దీనిపై వాదనలు విన్న న్యాయమూర్తి.. బెయిల్ పిటిషన్‌ను డిస్మిస్ చేశారు. వంశీ ప్రస్తుతం ఇదే కేసులో అరె÷-టసై విజయవాడ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న విషయం విదితమే.. ఇకపోతే వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని చికిత్స నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు పోలీసులు తీసుకొచ్చారు.

## రేవంత్, భట్టి విక్రమార్క పైనే ఆశలు.. ఏం చేస్తారో చూడాలి

తెలంగాణ: విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని ప్రధాని మోదీ పిలుపు ఇవ్వటంపై తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి ఘాటుగా స్పందించారు. రాజకీయ నాయకుల మాటలు, చేతలకు పొంతన ఉండదని ట్విట్టర్ వేదికగా విమర్శించారు. బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలు విద్యకు తక్కువ నిధులు కేటాయించా యని, ఫలితంగా ప్రభుత్వ బడులు కొన ఊపిరితో ఉన్నాయని విమర్శించారు. రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్కపై ఆశలు పెట్టుకున్నామన్న మురళి.. 10 శాతం విద్యార్థులకు గురుకులాల విద్య పూర్తి పరిష్కారం కాదన్నారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన ఇటీవల ఢిల్లీలో జరిగిన నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరైన సంగతి తెలిసిందే. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేయాలని, వ్యవసాయం, విద్య, ప్రజారోగ్యం వంటి అంశాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఈ సమావేశంలో ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. సీఎం రేవంత్ ప్రత్యేకంగా భేటీ అయిన సందర్భంగా మోదీ ఈ కామెంట్స్ చేశారు. ఈ భేటీపై రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి ట్విట్టర్ ఎక్స్ వేదికగా ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు.

విద్య కీలక ప్రాధాన్యతా అంశంగా ప్రధానమంత్రి పేర్కొనడంపై ఆకునూరి మురళి స్పందించారు. రాజకీయ నాయకుల మాటలకు, చేతలకు మధ్య వ్యత్యాసం ఉంటుందని ఘాటుగా

స్పందించారు. అదే సమయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వంపైనా విమర్శలు చేశారు. ప్రస్తుతం సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కపైనే తమ ఆశలు ఉన్నాయన్నారు. వాళ్లు ఏం చేస్తారో చూడాలని ట్వీట్ చేశారు.

'అబద్దాలు ఆడడం , మోసపూరిత మాటలు మాట్లాడడం, ప్రజలను వంచించడం రాజకీయ నాయకులు అలవాటు చేసుకున్నారు. 2024-25 , 2025-26 ఆర్థిక సంవత్సరాల్లో కేంద్ర బడ్జెట్‌లో బీజేపీ ప్రభుత్వం విద్యకు కేటాయింపులు 2.5 % . గత 20 సం. లలో కనిష్టం. కానీ ప్రధాని మోదీ మాటలు చూడండి. మన కెసీఆర్ అయితే ప్లాన్ ప్రకారం విద్యను ధ్వంసం చేసిండు.

# ఉప ఎన్నికలు వస్తే గద్వాల్‌లో మనదే విజయం



హైదరాబాద్: తెలంగాణలో ఉప ఎన్నికలు వస్తే గద్వాల్‌లో మళ్లీ గులాబీ జెండా ఎగరవేస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు ధీమా వ్యక్తం చేశారు. 200 జెట్‌స్పీడ్‌తో తాము గెలవడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. గద్వాలకు చెందిన పలువురు బిఆర్ఎస్‌లో చేరగా వారికి కెటిఆర్ స్వగతం పలికారు. ఈసందర్భంగా సోమవారం తెలంగాణ
భవన్‌లో మీడియాతో కేటీఆర్ మాట్లాడారు. రుణమాఫీ పూర్తిగా అమలు చేయకుండా రేవంత్ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటుందని విమర్శలు చేశారు. ఈ శతాబ్దపు అతి పెద్ద మోసం కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అభయ హస్తమని మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణ రాష్టాన్ని సాధించిన తర్వాత పదేళ్ల తమ హయాంలో రాష్ట్రానికి బలమైన పునాది వేశామని ఉద్ఘాటించారు. దిక్కుమాలిన కాంగ్రెస్ పార్టీని పాలమూరు ప్రజలు నమ్మి బొక్కబోర్ల పడ్డారని చెప్పారు. ఇంకా ఎన్ని రోజులు చూడాలి కాంగ్రెస్ దరిద్రాన్ని అని రాష్ట్ర ప్రజలు బాధపడుతున్నారని మాజీ మంత్రి కేటీఆర్ చెప్పుకొచ్చారు. పదిమంది నేతలు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వెళ్లారని.. వారికి కర్రు కాల్చివాత పెట్టాలని హెచ్చరించారు మాజీ మంత్రి కేటీఆర్. మనతోనే ఉండి మనకే వెన్నుపోటు- పొడిచి వెళ్లిపోయారని మండిపడ్డారు. పార్టీ మారిన పదిమంది ఎమ్మెల్యేలకు తగిన గుణపాఠం చెప్పాలని అన్నారు. నాడు నీళ్లు, నిధులు , నియామకాల కోసం ఉద్యమం చేశామని గుర్తుచేశారు. నేడు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత నిందలు, దందాలు, చందాలు చేస్తున్నారని ఆరోపించారు. రుణమాఫీపై సీఎం రేవంత్‌రెడ్డి చాలాసార్లు మాట మార్చారని మండిపడ్డారు. అపరిచితుడు చిత్రంలోని రాము, రెమోలాగా రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నారని విమర్శించారు. జూన్ మాసంలో బీఆర్ఎస్ మెంబర్ షిప్ ప్రారంభిస్తామని ప్రకటించారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు కొత్త కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మన పార్టీ నుంచి వెళ్లిన పది మంది ఎమ్మెల్యేలను ఉప ఎన్నికల్లో పండబెట్టి తొక్కే విదంగా ఓడించాలి.. మీ ఆవేశం చూస్తుంటే రాబోయే గద్వాల ఉప ఎన్నికల్లో మనం సామాన్య వ్యక్తిని పెట్టినా గెలుస్తాం అన్నారు.. ఈ శతాబ్దపు అతి పెద్ద మోసం కాంగ్రెస్ ఇచ్చిన అభయహస్తం హామీ అని ఎద్దేవా చేశారు. ఎన్ని రోజులు చూడాలి ఈ కాంగ్రెస్ దరిద్రాన్ని అని అందరూ అడుగుతున్నారు అని కేటీఆర్ చెప్పుకొచ్చారు. ఇక, గతంలో నీళ్ల, నిధులు, నియామకాలు అని మనం పని చేస్తే కాంగ్రెస్ పార్టీ నిందలు, దందాలు, చందాలు అని పని చేస్తుంది అని కేటీఆర్ తెలిపారు. ముఖ్యమంత్రి మాటలు వింటుంటే ఆయన మానసిక స్థితి మీద అనుమానం కలుగుతుంది అని పేర్కొన్నారు. అప్పులు పుట్టట్లేదు అంటాడు ఆయనే లక్ష యాభై కోట్ల అప్పు చేసిన అంటాడు.. మరో మూడేండ్లు ఈ దరిద్రం అనుభవించాల్సిందే.. రాబోయే ఏ ఎన్నికలు అయినా కారు గుర్తును గెలిపించాల్సిందే అని కోరారు. కేసీఆర్ ముందే చెప్పినా మనం మోసపోయాం.. జూన్ లో మెంబర్షిప్ ప్రారంభం చేసుకుందాం.

# పార పట్టి పనులు చేసిన ఏపీ మంత్రి



కడప: టీడీపీ మహానాడు వేడుకలు అంగరంగ వైభవంగా ప్రారంభం కానున్నాయి. రాయలసీమ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేలా ఈ సభను నిర్వహిస్తున్నారు. మంత్రి నిమ్మల రామానాయుడు స్వయంగా పనులు పర్యవేక్షిస్తూ కార్యకర్తలకు ఆదర్శంగా నిలిచారు. చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ సహా ముఖ్య నేతలంతా హాజరుకానున్నారు. రాయలసీమ అభివృద్ధిపై ప్రత్యేక చర్చ జరగనుంది. ఈ మహానాడు కడప చరిత్రలో ఒక మైలురాయిగా నిలవనుంది.

కడపలో టీడీపీ మహానాడు వేడుకలు మంగళవారం ప్రారంభంకానున్నాయి.. దీంతో సందడి వాతావరణం కనిపిస్తోంది. అయితే మంత్రి నిమ్మల రామానాయుడు పార్టీకి కార్యకర్తగా కూడా తన బాధ్యతను నిర్వర్తించారు. మహానాడు సభా ప్రాంగణ కమిటీ కన్వీనర్‌గా ఆయన వర్షం వల్ల సభా ప్రాంగణంలోకి నీళ్లు రావడంతో వెంటనే స్పందించారు. స్వయంగా పార పట్టి సభా ప్రాంగణాన్ని చదును చేశారు. తాను ఒక కార్యకర్తనే అని ఆయన చెప్పకనే చెప్పారు.. ఆయన్ను టీడీపీ నేతలు, కార్యకర్తలు ప్రశంసించారు. మంత్రి రామానాయుడు టీడీపీ మహానాడు దగ్గర పనుల్ని స్వయంగా పర్యవేక్షిస్తున్నారు.

కడపలో టీడీపీ మహానాడు సంబరం జరగడానికి ఏర్పాట్లు దాదాపు పూర్తయ్యాయి. టీడీపీ చరిత్రలో మొదటిసారిగా కడప జిల్లాలో ఈ కార్యక్రమం జరుగుతోంది. టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు సోమవారం సాయంత్రం ఇక్కడికి రానున్నారు. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ కుప్పం నుంచి కడపకు చేరుకుంటారు. మంత్రులంతా ఇప్పటికే కడపకు చేరుకున్నారు. పార్టీ తోరణాలు, కటౌట్లు, ఫ్లెక్సీలతో మహానాడు ప్రాంగణం, కడప, కమలాపురం నియోజకవర్గాలు పసుపుమయంగా మారాయి. కమలాపురం నియోజకవర్గం పబ్బాపురం సమీపంలోని 150 ఎకరాల విస్తీర్ణంలో మహానాడును నిర్వహిస్తున్నారు.

రాయలసీమ ప్రజల కోరికలు నెరవేర్చేలా కడపలో మహానాడు నిర్వహిస్తున్నట్లు మంత్రి అచ్చెన్నాయుడు చెప్పారు. మహానాడు ఏర్పాట్లపై మంత్రులు, ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించారు. రాయలసీమ డిక్లరేషన్‌పై ప్రధానంగా చర్చిస్తామన్నారు. ఈ నెల 29న జరిగే బహిరంగ సభకు 5 లక్షల మందికి పైగా వస్తారని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. గతంలో జరిగిన మహానాడుల కంటే కడప మహానాడు ప్రత్యేకంగా ఉంటుందన్నారు. మంగళవారం ఉదయం 8.30 గంటలకు ప్రతినిధుల నమోదుతో మహానాడు ప్రారంభమవుతుంది. ఆ తర్వాత పార్టీ చరిత్రను వివరిస్తూ రూపొందించిన ఫొటో ఎగ్జిబిషన్, రక్తదాన శిబిరాల్ని ప్రారంభిస్తారు. ఉదయం 10.45కు ఎన్టీఆర్ విగ్రహానికి నివాళితో మహానాడు లాంఛనంగా ప్రారంభమవుతుంది.

అనంతరం ఇటీవల మరణించిన నాయకులు, కార్యకర్తలకు సంతాపం ప్రకటిస్తారు. పార్టీ ప్రధాన కార్యదర్శి నివేదిక, ఉదయం 11.30కి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు స్వాగత ప్రసంగం, పార్టీ జమా ఖర్చులపై కోశాధికారి నివేదిక ఉంటాయి. 11.50కి పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభోపన్యాసం చేస్తారు. మొదటి రోజు పార్టీ ప్రతినిధుల సభ జరుగుతుంది.. సంస్థాగత నిర్మాణం, భవిష్యత్తు కార్యాచరణ, పార్టీ ముఖ్య సిద్ధాంతాలపై నేతలు కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తారు. కడప వేదికగా జరగనున్న మహానాడులో రాయలసీమ అభివృద్ధే లక్ష్యంగా ప్రత్యేకంగా చర్చించనున్నారు. 'రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏడాది పాలనపై రూపొందించిన 14 తీర్మానాలు, నాలుగు ఉమ్మడి తీర్మానాల్ని చర్చించి ఆమోదించనున్నారు. రాయలసీమ ఫ్యాక్షన్ కట్టడికి గత టీడీపీ ప్రభుత్వం తీసుకున్న చర్యలు, ఆ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసేందుకు ప్రాజెక్టులు.. కడప జిల్లా కొప్పర్తిలో పారిశ్రామిక హబ్, కర్నూలులో ఓర్వకల్లు హబ్, అనంతపురంలో కియా, పవన, సౌర విద్యుత్తు ప్రాజెక్టులు, పాడి పరిశ్రమాభివృద్ధి ద్వారా లక్షల మంది యువతకు ఉపాధి కల్పనకు తెదేపా కృషిని మహానాడు వేదికగా ప్రజల్లోకి తీసుకెళ్లనున్నారు' అని టీడీపీ నేతలు అంటున్నారు.

# వారం ముందుగానే భారీ వర్షాలు

ఆంధ్రప్రదేశ్ రైతులకు వాతావరణ శాఖ శుభవార్త తెలిపింది. నైరుతి రుతుపవనాలు రాయలసీమ ప్రాం తం ద్వారా రాష్ట్రంలోకి ప్రవేశించాయని, రాగల మూడు రోజుల్లో మిగిలిన ప్రాంతాలకు విస్తరించే అవకాశం ఉందని తెలిపింది. దీని ప్రభావంతో కోస్తాంధ్ర, రాయలసీమ, తెలంగాణలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని అధికారులు హెచ్చరించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రజలకు, ముఖ్యంగా రైతులకు వాతావరణశాఖ తీపికబురు చెప్పింది. నైరుతి రుతు పవనాలు ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశించాయని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. రాబోయే మూడు రోజుల్లో మిగిలిన ప్రాంతాలకు విస్తరించేందుకు అనుకూల పరిస్థితులు ఉందని తెలిపారు. 'సోమవారం(26-5-2025) ఆంధ్రప్రదేశ్ లోని రాయలసీమ ప్రాంతాల్లోకి ప్రవేశించిన నైరుతి రుతుపవనాలు.. మిగతా ప్రాంతాలకు రుతుపవనాలు విస్తరించేందుకు వాతావరణ పరిస్థితులు అనుకూలం.. 2024లో జూన్ 2న ఏపీలో ప్రవేశించిన రుతుపవనాలు' అంటూ ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. 'ఇవాళ అల్లూరి సీతారామరాజు, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, కర్నూలు, అనంతపురం జిల్లాల్లో అక్కడక్కడ మోస్తారు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.మిగతా జిల్లాల్లో పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉంది

. ఉద్యానవన రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి' అని సూచించారు.

మరోవైపు తెలంగాణలోని కొన్ని ప్రాంతాల్లోకి రుతుపవనాలు ప్రవేశించినట్లు ఐఎండీ తెలిపింది. ఉత్తర తెలంగాణపై ద్రోణి కొనసాగుతుండటంతో తెలంగాణలో సోమవారం నుంచి గురువారం వరకు భారీ వర్షాలు కురిసే అవకాశాలు అన్నాయని అంచనా వేస్తున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లో పలుచోట్ల భారీ వర్షాలు కురుస్తాయని, ఇతర జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని పేర్కొంది. మరోవైపు మహారాష్ట్ర దగ్గర ఏర్పడిన వాయుగుండం బలహీనపడింది. ఇది అల్పపీడనంగా మారిందని ఐఎండీ తెలిపింది. ఈ ప్రభావంతో రాబోయే నాలుగు రోజుల్లో కోస్తాంధ్ర, రాయలసీమ, తెలంగాణలో భారీ వర్షాలు కురుస్తా యని హెచ్చరించారు. అంతేకాదు, బంగాళాఖా తంలో మరో అల్పపీడనం ఏర్పడనుందని వాతావరణ శాఖ తెలిపింది. ఇది మరింత బలపడి బంగ్లాదేశ్ వైపు వెళ్లే అవకాశం ఉంది. మహారాష్ట్ర లోని రత్నగిరి దగ్గర తీరం దాటిన వాయుగుండం బలహీనపడింది. ఇది తీవ్ర అల్పపీడనంగా మారింది. ఇది మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల్లో ఉంది. ఇది తూర్పు దిశగా కదులుతూ మరింత బలహీనపడుతుందని ఐఎండీ అంచనా వేసింది.

అరేబియా సముద్రం నుంచి మహారాష్ట్ర, తెలంగాణ,

ఛత్తీస్‌గఢ్ మీదుగా ఒడిశా వరకు ఉపరితల ద్రోణి ఉంది. దీని కారణంగా మంగళవారం బంగాళాఖా తంలో అల్పపీడనం ఏర్పడనుంది. దీని ప్రభావంతో ఈ నెల 29 వరకు కోస్తాంధ్ర, రాయలసీమ, తెలంగాణలో భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ తెలిపింది. ఉరుములతో కూడిన గాలులు గంటకు 70 కి.మీ. వేగంతో వీస్తాయని అంచనా వేస్తోంది.

మహారాష్ట్ర దగ్గర కొనసాగుతున్న అల్పపీడనం తెలంగాణ, ఏపీ మీదుగా బంగాళాఖాతంలోకి వెళ్తుందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. దీని వల్లనే బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడుతుం దని అంచనా వేస్తున్నారు. మంగళ వారం నాటికి వాయుగుండంగా మారుతుందని, గురువారం నాటికి బంగ్లాదేశ్ దగ్గర తీరం దాటుతుందని అంచనా వేస్తున్నారు.

వేగుచుక్క

# సంపూర్ణ అక్షరాస్యతకు సమిష్టిగా కృషి.

**కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు.**

**ఇందూరు అక్షర లక్ష్మి' యాప్ ను ఆవిష్కరించిన జిల్లా పాలనాధికారి.**

**రాష్ట్రంలోనే తొలిసారిగా యాప్ రూపకల్పన.**



**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, మే 26**

నిజామాబాద్ ను సంపూర్ణ అక్షరాస్యత కలిగిన జిల్లాగా తీర్చిదిద్దేందుకు సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది సమిష్టిగా, అంకిత భావంతో కృషి చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు పిలుపునిచ్చారు. స్వయం సహాయక సంఘాలలోని ప్రతి సభ్యురాలి విద్యార్హతలు గుర్తిస్తూ, నిరక్షరాస్యులుగా ఉన్న వారికి చదవడం, రాయడం నేర్పించాలనే బృహత్తర సంకల్పంతో రాష్ట్రంలోనే తొలిసారిగా సెర్ప్, తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ, సమగ్ర శిక్ష, వయోజన విద్యా శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఇందూరు అక్షరలక్ష్మి' పేరుతో రూపొందించిన యాప్ ను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సోమవారం ఐడీఓసీ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్ లో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి లాంఛనంగా ఆవిష్కరించారు. సంపూర్ణ అక్షరాస్యత సాధనే లక్ష్యంగా యాప్ ను రూపొందించడం పట్ల కలెక్టర్ సంబంధిత అధికారులను అభినందించారు. జిల్లాలో స్వయం సహాయక సంఘాలలో సుమారు 3.40 లక్షల మంది సభ్యులు కొనసాగుతున్నారని కలెక్టర్ గుర్తు చేశారు. ఇందూరు అక్షర లక్ష్మి యాప్ ద్వారా సీ.సీలు, వీ.ఓ.ఏ ల సహాయంతో ప్రతి ఎస్.హెచ్.జీ సభ్యురాలి విద్యా సంబంధిత వివరాలను సేకరించి యాప్ లో నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. నిరక్షరాస్యులుగా గుర్తించబడిన వారికి అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, విద్యావంతులు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో గ్రామాల్లో అక్షరాస్యతా కేంద్రాలను ఏర్పాటు చేసి వాలంటీర్ల ద్వారా వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దడం జరుగుతుందని అన్నారు. అదేవిధంగా పదవ తరగతి లోపు చదువుకున్న వారిని ఓపెన్ స్కూల్ ద్వారా పదవ తరగతి పరీక్షలు రాయించడం, ఎస్ ఎస్ సి ఉత్తీర్ణులైన వారిని ఓపెన్ ఇంటర్ పరీక్షలు రాయించడం జరుగుతుందని తెలిపారు. గణాంకాల ప్రకారం జిల్లాలో మహిళల అక్షరాస్యత 55 శాతంగా ఉందని, సంపూర్ణ అక్షరాస్యత కార్యక్రమం అమలు ద్వారా నూటికి నూరు శాతం మహిళా అక్షరాస్యత సాధించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. నిర్ణీత కాల వ్యవధిని నిర్దేశించుకుని, లక్ష్య సాధన కోసం అంకిత

భావంతో కలిసి కట్టుగా కృషి చేయాలని హితవు పలికారు. 2026 మార్చి నెలలో జరిగే ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షల సమయం నాటికి స్వయం సహాయక సంఘాల మహిళా సభ్యులను ఓపెన్ ఎగ్జామ్స్ కు సన్నద్ధం అయ్యేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని సూచించారు. సంపూర్ణ అక్షరాస్యత సాధన కార్యక్రమానికి జిల్లా యంత్రాంగం తరపున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ సాయాగౌడ్, ఏ.పీ.డీ రవీందర్, డీఈఓ అశోక్, డీడబ్ల్యూఓ రసూల్ బీ, డీఎంహెచ్ఓ డాక్టర్ రాజశ్రీ, వయోజన విద్యా సంయుక్త సంచాలకులు గోవింద్ రావు, స్వయం సహాయక మహిళా సమాఖ్య ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గురుకుల కళాశాలల మూసివేతను విరమించుకోవాలి.

## - జిల్లా కలెక్టర్ కి పిడిఎస్ యు వినతి.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, మే 26:**



రాష్ట్రవ్యాప్తంగా బాల, బాలికల 12 ఇంటర్ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలు మూసివేతను విరమించు కోవాలని పిడిఎస్ యు విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణిలో జిల్లా అదనపు కలెక్టర్ కి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా పిడిఎస్ యు జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ కర్క గణేష్ మాట్లాడుతూ, 1985 సంవత్సరం నుండి నేటి వరకు ఇంగ్లీష్ మీడియం లో దళిత విద్యార్థులకు విద్యను బోధిస్తూ ఎన్నో అవకాశాలు అందించడం జరిగిందన్నారు. కానీ నేటి కాంగ్రెస్ హయాంలో 12 సాంఘిక సంక్షేమ బాల, బాలికల గురుకుల కళాశాల ఇంటర్ విద్యను దళిత విద్యార్థులకు దూరం చేయడం దుర్మార్గమన్నారు. ఈ 12 గురుకులాలలో నాలుగు బాలురకు సంబంధించినవి ఎనిమిది బాలికలకు సంబంధించిన గురుకులాలు ఉన్నవన్నారు. 12 గురుకులాలు మూసివేత వలన ఒక్కో గురుకులంలో 160 మంది చొప్పున విద్యార్థులు దాదాపు 2000 మంది విద్యార్థులు తమ విద్యను దూరం చేసుకుని అవకాశం ఉన్నదన్నారు. భవిష్యత్తులో దాదాపు 200 ఉద్యోగాలు నిరుద్యోగులకు దూరమయ్యే అవకాశం ఉన్నదన్నారు.

ఈ విధంగా దళిత విద్యార్థులకు న్యాయం జరుగుతుంటే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవరించడం సిగ్గుచేటన్నారు. ఇదేనా తెలంగాణ దళిత విద్యార్థులు కలలుగన్న విద్యను దూరం చేయడమేనా ప్రజాపాలన అని ప్రశ్నించారు. వెంటనే గురుకులాల్లో ఇంటర్ విద్యార్థులకు సంబంధించిన కళాశాల మూసివేత విరమించుకుని రాష్ట్రవ్యాప్తంగా గురుకులాల్లో నెలకొన్న మౌలిక సదుపాయాలు, టీచింగ్ నాన్ టీచింగ్ సిబ్బంది నియమించాలని, విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించే విధంగా కృషి చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థి ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్ యు నాయకులు సృజన్, నాగేష్, సంతోష్, సాయి లతో తదితరులు పాల్గొన్నారు.

# టియుసిఐ ఆహ్వాన సంఘం కరపత్రాల ఆవిష్కరణ.



**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, మే 26:**

ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టియుసిఐ) రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం కరపత్రాలను ఆ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కోటగల్లి, శ్రామిక భవన్లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీయుసీఐ రాష్ట్ర అధ్యక్షులు వనమాల కృష్ణ మాట్లాడుతూ, వచ్చేనెల 21, 22 తేదీలలో నిజామాబాద్ జిల్లా కేంద్రంలో టీయుసీఐ రాష్ట్ర మహాసభలు జరుగుతాయన్నారు. ఈ మహాసభలకు టీయుసీఐ జాతీయ నేతలు, ఉమ్మడి తెలుగు రాష్ట్రాల వివిధ జిల్లాల ప్రతినిధులు జిల్లాలోని కార్మికులు హాజరవుతారన్నారు. ఈ మహాసభల్లో కార్మిక హక్కులు, సమస్యలు, గత ఉద్యమాలను సమీక్షించుకొని, భవిష్యత్తు కర్తవ్యాలను రూపొందించడం జరుగుతుందన్నారు. జిల్లాలోని కార్మికులు, ప్రజలు ప్రజాస్వామ్యవాదులు, వ్యాపార వర్గాలు ఆర్థిక హార్దిక సహకారం అందించి, మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునివ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో టీయుసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్ జిల్లా ఉపాధ్యక్షులు ఎం.వెంకన్న, డి.రాజేశ్వర్ జిల్లా సహాయ కార్యదర్శి బి.మల్లేష్, జిల్లా నాయకులు సాయన్న, కిరణ్, విఠల్, రవి, మురళి తదితరులు పాల్గొన్నారు.

# క్షయ వ్యాధినీ నిర్మూలనకు కృషి చేయాలి.

**జిల్లా వైద్య మరియు ఆరోగ్యఅధికారిని డాక్టర్ బి. రాజశ్రీ.**

**క్షయ వ్యాధి నిర్ధారణ సర్వే ప్రారంభం.**





**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, మే 26:**

క్షయ వ్యాధినీ నిర్మూలనకు కృషి చేయాలనీ జిల్లా వైద్య మరియు ఆరోగ్యఅధికారిని డాక్టర్ బి. రాజశ్రీ పిలుపునిచ్చారు. టిబి ముక్త్ భారత్ అభియాన్ లో భాగంగా మే 26 నుండి ఆగష్టు 30 వరకు టిబి సర్వే కొనసాగనుండగా, సోమవారం ఖానాపూర్ లోని బస్తీ దావఖాన లో డి.యం.హెచ్.వో. డాక్టర్ రాజశ్రీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, క్షయ వ్యాధి కి గురి కావడానికి అవకాశాలు ఉన్న మధుమేహం, కాన్సర్, రక్తపోటు, గతంలో టిబి వ్యాధి కి గురిఅయిన వారు, 60 సంవత్సరాల వయసు పైబడిన వారు, ఫ్యాక్టరీ లలో పని చేసే వారు, దూమపానం, మద్యపానం చేసే వారు పరీక్షలు చేసుకోవాలని సూచించారు. వీరితో పాటు క్షయ లక్షణాలు ఉన్నవారికి క్షయ పరీక్షలు, ఛాతి ఎక్స రే చేయడం జరుగుతుందని ఒకవేళ టిబి నిర్ధారణ అవుతే వారికి ప్రభుత్వం నేరుగా వారి ఖాతాలోకి ప్రతీ నెల 1000 రూపాయల చొప్పున ఆరు నెలలు జమ చేస్తారని వివరించారు. పోషకాహార నిమిత్తం ఈ డబ్బులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్య సిబ్బంది జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలోని గ్రామాలలో పర్యటిస్తారని ప్రజలు సహకరించాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్యఅధికారి డాక్టర్ బి. రాజశ్రీ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా టిబి నియంత్రణ అధికారి డాక్టర్ దేవి నాగేశ్వరి, ఇంచార్జ్ డిప్యూటీ డియంచ్ వో తుకారాం రాటోడ్, డాక్టర్ అవంతి, డాక్టర్ ప్రత్యూష, టిబి కోఆర్డినేటర్ రవి, హెల్త్ సూపెర్వైసర్ మధుకర్, సిఏస్ వో నవీన్, లక్ష్మణ్, నరేష్, స్రవంతి, భూపాల్ మరియు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# దేశ చరిత్రలోనే తొలిసారి.. వారికి కోటి ప్రమాద బీమా..

**తెలంగాణ:** ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విద్యుత్ కార్మికులకు కోటి రూపాయల ప్రమాద బీమా అందించడం దేశ చరిత్రలోనే రికార్డు అని అన్నారు. ప్రజాభవన్ లో ఎన్పీడీసీఎల్ పరిధిలో ప్రాణాలు కోల్పోయిన జోగు నరేశ్ కుటుంబానికి కోటి రూపాయల బీమా చెక్కుతో పాటు.. మరో కార్మికుడు రమేశ్ శ్రీమతికి కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేశారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వం కార్మికుల కోసం ఇంత గొప్ప ఆలోచన చేసిందని, గతంలో ఏ ప్రభుత్వం చేయలేదని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఈ పథకం కార్మికులకు భరోసా నింపుతుందని, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డిని అభినందించారు.

తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ కార్మికుల సంక్షేమం, భద్రతకు కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతని స్తోంది. ఈ నిబద్ధతను చాటుతూ.. విద్యుత్ కార్మికుల కు కోటి రూపాయలకు పైబడిన ప్రమాద బీమా అందించడం దేశ చరిత్రలోనే ఒక రికార్డు అని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. నేడు ప్రజాభవన్ లో జరిగిన ఒక కార్యక్రమంలో.. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన విద్యుత్ కార్మికుల కుటుంబాలకు ఈ భారీ బీమా మొత్తాన్ని అందజేసింది.




ఎన్పీడీసీఎల్ (నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్) పరిధిలో విధులు నిర్వహిస్తూ ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోయిన జోగు నరేశ్ కుటుంబ సభ్యులకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కోటి రూపాయల ప్రమాద బీమా చెక్కును అందజేశారు. అంతేకాకుండా.. విద్యుత్ శాఖలో ప్రాణాలు కోల్పోయిన మరో కార్మికుడు రమేశ్ శ్రీమతికి కారుణ్య నియామక ఉత్తర్వులను కూడా ఈ సందర్భంగా అందజేసి, వారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు.

ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. విద్యుత్ కార్మికునికి కోటి రూపాయల ప్రమాద బీమా చెక్కును అందించడం కేవలం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వంలో మాత్రమే సాధ్యమైందని ఉద్ఘాటించారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా కార్మికుల కోసం ఇంత గొప్పగా ఆలోచన చేయలేదని.. ఈ స్థాయిలో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టలేదని విమర్శించారు. ఈ ప్రమాద బీమా, కారుణ్య నియామక పత్రం అందించడం ప్రభుత్వ ఆలోచనకు మానవీయ కోణానికి అద్దం పడుతుందని ఆయన స్పష్టం చేశారు.

కార్మికులకు ప్రమాద బీమా పథకాన్ని మొదట సింగరేణి బొగ్గు గనుల సంస్థలో ప్రవేశపెట్టిన విషయాన్ని డిప్యూటీ సీఎం గుర్తు చేశారు. అక్కడ విజయం సాధించిన ఈ పథకాన్ని ఇప్పుడు విద్యుత్ సంస్థల్లోనూ ఆచరణలోకి తీసుకురావడం ద్వారా.. కార్మికుల భద్రతకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని తెలిపారు. కోటి రూపాయల పైబడిన ప్రమాద బీమా విద్యుత్ సంస్థలో పనిచేసే కార్మికులందరిలో ఒక కొత్త భరోసాను నింపుతుందని.. వారు మరింత అంకితభావంతో పనిచేయడానికి ప్రోత్సాహాన్ని ఇస్తుందని భట్టి విక్రమార్క అన్నారు.

విద్యుత్ ఉద్యోగులు ఈ కొత్త భరోసాతో మరింత అంకితభావంతో రాష్ట్ర ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని డిప్యూటీ సీఎం కోరారు. ప్రభుత్వ ఆలోచనను సమర్థవంతంగా అమలు చేసిన ఎన్పీడీసీఎల్ (%చీూణజూ%)సీఎండీ వరుణ్ రెడ్డిని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, విద్యుత్ శాఖ, బ్యాంకు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ పథకం ద్వారా విద్యుత్ కార్మికుల కుటుంబాలకు ఆర్థిక భద్రత చేకూరుతుందని, వారి భవిష్యత్తుకు భరోసా లభిస్తుందని ప్రభుత్వం ఆశిస్తోంది. ఇటీవల గిగ్ వర్కర్లకు కూడా తెలంగాణ ప్రభుత్వం రూ.5 లక్షల ప్రమాద బీమాను కల్పించించిన సంగతి తెలిసిందే.

# వచ్చే 4 రోజులు ఈ జిల్లాల్లో భారీ వర్షాలు

**తెలంగాణ:** లోకి నైరుతి రుతుపవనాలు తెలంగాణలోని కొన్ని ప్రాంతాలను తాకినట్లు ఐఎండీ అధికారులు వెల్లడించారు. మే నెలాఖరు వరకు మిగతా అన్ని ప్రాంతాలకు తాకే ఛాన్స్ ఉందని చెప్పారు. కాగా, రాబోయే నాలుగు రోజులు రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తాయన్నారు. నేడు పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరికలు జారీ చేశారు. గంటకు 30-40 కి.మీ. వేగంతో ఈదురు గాలులు వీస్తాయన్నారు.

తెలంగాణ రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు ప్రవేశించినట్లు భారత వాతావారణ శాఖ హైదరాబాద్ అధికారులు వెల్లడించారు. కాసేపటి క్రితం రాష్ట్రంలోకి రుతుపవనాలు ప్రవేశించాయన్నారు. ఈ నెలాఖరు నాటికి మిగతా అన్ని ప్రాంతాల్లో రుతు పవనాలు విస్తరిస్తాయన్నారు. రాబోయే నాలుగు రోజులు రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తాయని చెప్పారు. పిడుగుపాట్ల సంభవించే ఛాన్స్ ఉందని.. అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ఇవాళ ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్ జిల్లాలలో భారీ వర్షాలకు ఛాన్స్ ఉందని చెప్పారు. ఈదురు గాలులు గంటకు 30-40 కి.మీతో వీస్తాయన్నారు. మిగతా అన్ని జిల్లాలలో అక్కడక్కడ తేలికపాటి వర్షాలకు ఛాన్స్ ఉందని పేర్కొన్నారు.

ఇక మంగళవారం (మే 27న) జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట జిల్లాలలో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయన్నారు. గాలి వేగంలో మార్పు ఉండదని మిగతా జిల్లాల్లో తేలికపాటు వర్షాలకు ఛాన్స్ ఉందని చెప్పారు. ఉత్తర తెలంగాణపై ద్రోణి ప్రభావం కొనసాగుతున్నందున మే 29 వరకు రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. రాబోయే 4 రోజుల పాటు రాష్ట్రంలో మేఘావృతమైన వాతావరణం ఉంటుందని తెలిపింది. గత కొద్ది రోజులుగా రాష్ట్రంలో ఉదయం పూట అధిక ఉష్ణోగ్రతలు నమోదై.. సాయంత్రం వేళల్లో ఒక్కసారిగా వాతావరణం చల్లబడి వర్షాలు కురుస్తున్నాయి.

ఇటీవల కురిసిన అకాల వర్షాల కారణంగా రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఎండబెట్టిన ధాన్యం తడిసిపోవడంతో అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. టార్పాలిన్లు సరిపడినన్ని లేకపోవడం ఈ సమస్యను మరింత పెంచింది. ఇటీవల కాలంలో పిడుగుపాటు ఘటనలు కూడా పెరిగాయి. ఏదో ఒక చోట పిడుగుపాటుతో ప్రాణాలు కోల్పోతున్న సంఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. వర్షాలు పడుతున్న సమయంలో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని, చెట్ల కింద, విద్యుత్ స్తంభాల వద్ద ఆశ్రయం పొందవద్దని అధికారులు సూచిస్తున్నారు. రైతులు తమ ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, తగినంత సంఖ్యలో టార్పాలిన్లను సిద్ధం చేసుకోవాలని విపత్తుల నిర్వహణ శాఖ అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావుకు అమెరికా ప్రభుత్వం షాక్

**తెలంగాణ:** ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడు, మాజీ చీఫ్ ప్రభాకర్ రావుకు వరుస ఎదురు దెబ్బలు తగులుతున్నాయి. అమెరికాలో రాజకీ య శరణార్థిగా ఆశ్రయం కోరుతూ ఆయన వేసిన పిటిషన్ను యూఎస్ ప్రభుత్వం తిరస్కరించింది. జూన్ 20న నాంపల్లి కోర్టులో విచారణ ఉండగా.. కోర్టుకు హాజరుకాకపోతే ప్రకటిత నేరస్థుడిగా పరిగణించే అవకాశం ఉంది. ఇంటర్పోల్ జారీ చేసిన రెడ్ కార్నర్ నోటీసుల అమలును అమెరికా ముమ్మరం చేసింది.

తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడిగా ఉన్న మాజీ ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్ రావుకు వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. అరెస్ట్ నుంచి తప్పించుకునేందుకు ఆయన చేసిన ప్రయత్నాలు బెడిసికొట్టాయి. ప్రస్తుతం అమెరికాలో ఉన్న ఆయన.. తెలంగాణ ప్రభుత్వం తనపై రాజకీయ కక్షతో కేసు పెట్టిందని, తనను రాజకీయ శరణార్థిగా గుర్తించాలంటూ గత ఏడాది నవంబర్ 29న అమెరికా ప్రభుత్వానికి పిటిషన్ సమర్పించాడు. తాజాగా ఆ పిటిషన్ను అమెరికా ప్రభుత్వం తిరస్కరించింది. తమ దేశంలో ఆశ్రయం కల్పించబోమని అమెరికా తేల్చిచెప్పింది.

మరోవైపు ప్రభాకర్ రావు వచ్చే నెల జూన్ 20న నాంపల్లి కోర్టులో విచారణకు హాజరు కావాల్సి ఉంది. ఆయన కోర్టుకు హాజరు కాని పక్షంలో ప్రకటిత నేరస్థుడిగా పరిగణించే అవకాశాలున్నాయి. ఇది ఆయనపై మరింత ఒత్తిడిని పెంచుతోంది. ఇప్పటికే ప్రభాకర్ రావును స్వదేశానికి రప్పించడంలో కీలక అడుగులు పడ్డాయి. ఇంటర్పోల్ గత మార్చి 10న ఆయనపై రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేసింది. దీని అమలు ప్రక్రియను అమెరికా ప్రభుత్వం ముమ్మరం చేసింది. ప్రభాకర్ రావును భారత్కు పంపించేందుకు యూఎస్ హెూమ్ల్యాండ్ సెక్యూరిటీ ఏజెన్సీ పూర్తి బాధ్యతలు తీసుకున్నట్లు సమాచారం.

ఇక ఈ కేసు తెలంగాణలో సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాజకీయ నాయకులు, వ్యాపారులు, సినీ ప్రముఖులు, చివరికి న్యాయమూర్తుల ఫోన్లను కూడా అక్రమంగా ట్యాప్ చేశారనే ఆరోపణలతో ఈ కేసు తెరపైకి వచ్చింది. 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్దిరోజులకే ఈ కేసు వివరాలు వెలుగులోకి వచ్చాయి. ముఖ్యంగా మాజీ చీఫ్ ప్రభాకర్ రావు, ఇతర పోలీసు అధికారులపై ఈ ఆరోపణలు వెల్లువెత్తాయి. %వా×దీ%లో డీఎస్పీగా పనిచేసిన ప్రణీత్ రావు అరెస్టుతో



ఈ కేసులో కీలక మలుపు తిరిగింది. ప్రణీత్ రావు విచారణలో వెల్లడించిన విషయాల ఆధారంగానే కేసు దర్యాప్తు వేగవంతమైంది.


ప్రభుత్వం మారిన తర్వాత అక్రమ ట్యాపింగ్ కు సంబంధించిన డేటాను పెద్ద ఎత్తున ధ్వంసం చేయడానికి ప్రయత్నించారని ఆరోపణలున్నాయి. ప్రస్తుతం ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ప్రభాకర్ రావు అమెరికాలో ఉండగా.. ఆయన్ను స్వదేశానికి రప్పించేందుకు ఇంటర్పోల్ రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేసింది, అమెరికా హెూమ్ల్యాండ్ సెక్యూరిటీ ఏజెన్సీ ఆయనను భారత్కు పంపేందుకు చర్యలు తీసుకుంటోంది. పోలీస్ ఉన్నతాధికారులు భుజంగరావు, తిరుపతన్న, మాజీ డీసీపీ రాధాకిషన్ రావులతో పాటు మరికొందరు ఈ కేసులో నిందితులుగా ఉన్నారు. కేసు దర్యాప్తు కొనసాగుతోండగా.. రోజుకో కొత్త విషయం వెలుగులోకి వస్తూ తెలంగాణ రాజకీయ వర్గాల్లో సంచలనం సృష్టిస్తోంది.

వేగుచుక్క

# తెలుగు సినీ ఇండస్ట్రీకి కనీస మర్యాద, కృతజ్ఞత లేదు

త్వరలో సినిమా అభివృద్ధి పాలసీ రానుంది. టాలీవుడ్ లో గత కొన్ని రోజులుగా థియేటర్ల వివాదంపై చర్చలు జరుగుతున్న నేపథ్యంలో, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కార్యాలయం నుంచి ఓ సంచలన ప్రకటన వెలువడింది. రాష్ట్రంలో తెలుగు సినిమా రంగానికి పరిశ్రమ హెూదా కల్పించి అభివృద్ధి చేయాలని, ఈ రంగంలో ఉన్నవారి గౌరవమర్యాదలకు భంగం వాటిల్లకుండా చూస్తుంటే.. తెలుగు సినీ రంగంలో ఉన్నవారికి ప్రభుత్వం పట్ల కనీస మర్యాద, కృతజ్ఞత కనిపించడం లేదని పవన్ కళ్యాణ్ అభిప్రాయపడినట్లు ఓ ప్రెస్ నోట్ రిలీజ్ చేశారు. ఏపీలో ఎన్.డి.ఏ. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కావస్తున్నా తెలుగు సినిమా సంఘాల ప్రతినిధులు మర్యాదపూర్వకంగా ముఖ్యమంత్రిని కలిశారా? అని ఆ సందర్భంగా





ప్రశ్నించారు.

"ఎన్.డి.ఏ. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కావస్తున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని తెలుగు సినిమా సంఘాలు కనీసం ఒకసారి కూడా మర్యాదపూర్వకంగా కలవలేదు. కేవలం తమ చిత్రాల విడుదల సందర్భంలో ప్రభుత్వం ముందుకు రావడం మినహా, చిత్ర రంగం అభివృద్ధి కోసం సంఘటితంగా రాలేదు. అందరూ కలసి రావాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సూచించినా సానుకూలంగా స్పందించలేదు" అని ప్రకటనలో పేర్కొన్నారు. గత ప్రభుత్వం సినిమా రంగంవారిని, అగ్ర నటులను ఎలా ఛీత్కరించిందో మరచిపోయినట్లున్నారని.. ఇకపై ప్రభుత్వంతో వ్యక్తిగత చర్చలు ఉండవని.. సినిమా సంఘాల ప్రతినిధులే రావాలని తెలిపారు. కూటమి ప్రభుత్వం వ్యక్తులను కాదు, సినిమా రంగం అభివృద్ధినే చూస్తుందన్నారు.

"ఎన్నికలకు ముందు చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ చెప్పిన విధంగానే కూటమి ప్రభుత్వం వ్యక్తులను చూడలేదు. అక్కినేని నాగార్జున కుటుంబానికి చెందినవారి చిత్రం విడుదలైనప్పుడు సైతం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తగిన విధంగా ప్రోత్సహించింది. వ్యవస్థ బాగుండాలి, దానిపై ఆధారపడ్డవారు ఇబ్బందిపడకూడదు అనేదే కూటమి ప్రభుత్వ విధానం. తెలుగు సినిమా రంగంవారు తమ సినిమా విడుదల సమయంలో వ్యక్తిగతంగా వచ్చి అర్జీలు ఇచ్చి, టిక్కెట్ ధర పెంచమని కోరడం ఎందుకు? అందరూ కలసి వచ్చి ప్రభుత్వంతో స్పష్టంగా చర్చించమని పవన్ కల్యాణ్ సూచించారు"

"దిల్ రాజు, అల్లు అరవింద్, డి.సురేశ్ బాబు, వై.సుప్రియ, చినబాబు, సి.అశ్వనీదత్, నవీన్ ఎర్నేని వంటి నిర్మాతలు కలిసినప్పుడు అందరూ సంఘటితంగా ఉంటే పరిశ్రమగా అభివృద్ధి చేయవచ్చు అని కూడా పవన్ కల్యాణ్ తెలిపారు. అయినప్పటికీ ఎవరికి వారు వ్యక్తిగతంగా వచ్చి తమ సినిమా టికెట్ ధరలు పెంచమని సినిమాటోగ్రఫీ శాఖకి అర్జీలు ఇస్తూ వచ్చారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తూనే ఉంది. సినిమా రంగానికి పరిశ్రమ హెూదా ఇచ్చేందుకు ఆలోచనలు చేస్తున్న పవన్ కల్యాణ్ కి తెలుగు సినిమాకి చెందిన కొందరు ఇచ్చిన రిటర్న్ గిఫ్ట్ ను కూడా తగిన విధంగానే స్వీకరించాలని ఉప ముఖ్యమంత్రి నిర్ణయించుకున్నారు. ఈ రిటర్న్ గిఫ్ట్ కు కృతజ్ఞతలు తెలియచేశారు" అని ప్రెస్ నోట్ లో పేర్కొన్నారు.

# వెంకటేష్ చేస్తే బాగుంటుంది



మెగాస్టార్ చిరంజీవి, సిమ్రాన్ జంటగా 2001లో విడుదలైన 'డాడీ' సినిమా ఓ హృద్యమైన ఫ్యామిలీ డ్రామాగా నిలిచింది. సురేష్ కృష్ణ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో తండ్రి ప్రేమ, త్యాగం వంటి భావోద్వేగాలను హృదయాన్ని తాకేలా చూపించారు. అయితే ఈ సినిమా చిరంజీవి రేంజ్‌కు తగ్గ విజయాన్ని సాధించలేకపోయింది. చిరు స్వయంగా ఈ కథ తనకు కంటే వెంకటేష్‌కి బాగా సెట్ అవుతుందని చెప్పిన మాటలు ఆసక్తికరంగా నిలిచాయి. 97 సెంటర్లలో 50 రోజులు, 15 కేంద్రాల్లో 100 రోజులు ప్రదర్శించిన ఈ చిత్రం తెలుగు ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు తెచ్చుకుంది.

తన సినిమాల్లో మాస్, యాక్షన్ అంశాలే కాకుండా ఫ్యామిలీ ఆడియన్స్‌కి కూడా నచ్చేలా జాగ్రత్తలు తీసుకుంటారు మెగాస్టార్ చిరంజీవి. అలా చిరంజీవి హీరోగా సిమ్రాన్ హీరోయిన్‌గా తెరకెక్కిన 'డాడీ' చిత్రం 2001, అక్టోబర్ 4న రిలీజైంది. సురేష్ కృష్ణ డైరెక్షన్ చేసిన ఈ చిత్రాన్ని గీతా ఆర్ట్స్ బ్యానర్‌పై అల్లు అరవింద్ నిర్మించారు. అషిమా భల్లా, రాజేంద్రప్రసాద్, శరత్‌బాబు, బేబీ అనుష్క మల్హోత్రా తదితరులు నటించారు. ఎస్ఏ రాజ్‌కుమార్ స్వరపరిచిన పాటలు ఇప్పటికీ సంగీత ప్రియులను అలరిస్తూనే ఉంటాయి.

కథలోకి వెళ్తే.. డ్యాన్స్ స్కూల్, ఆడియో కంపెనీ నిర్వహించే రాజ్‌కుమార్(చిరంజీవి), తన భార్య శాంతి (సిమ్రాన్), కుమార్తె అక్షయ( అనుష్క మల్హోత్రా)తో సంతోషంగా జీవిస్తుంటాడు. అనుకోని సంఘటనలతో వారి జీవితంలో ఎలాంటి సంఘటనలు చోటుచేసుకున్నాయన్నదే మిగతా కథ. కుటుంబ బంధాలు, తండ్రి ప్రేమ, త్యాగం వంటి భావోద్వేగాలను ఎంతో హృద్యంగా చూపించారు దర్శకుడు. ఈ చిత్రంతో చిరంజీవికి ఫ్యామిలీ ఆడియన్స్‌లో క్రేజ్ మరింత పెరిగింది. కానీ ఊహించిన విధంగా ఈ చిత్రం సక్సెస్ కాలేకపోయింది. అయితే సురేష్ కృష్ణ ఈ కథ చెప్పినప్పుడే తనకంటే వెంకటేష్‌కి అయితే బాగా సెట్ అవుతుందని చిరంజీవి చెప్పారట. ఈ విషయాన్ని ఆయనే ఓ సందర్భంగా బయటపెట్టారు.

'డాడీ కథని నాకు చెప్పినప్పుడు నేను న్యాయం చేయలేననుకున్నాను. నాకంటే వెంకటేష్‌కి ఇది బాగా సెట్ అవుతుందని రచయిత భూపతిరాజుకు చెప్పారు. ఇది వెంకటేష్‌కి మామూలుగా ఉంటుంది. మీకైతే ఫ్యామిలీమెన్‌గా కాస్త వెరైటీగా ఉంటుందని ఆయన నన్ను ఒప్పించే ప్రయత్నం చేశారు. అయినా నేను మొహమాటం పడితే మీరు చేయాల్సిందేనని అందరూ నన్ను ఒత్తిడికి గురిచేయడంతో బలవంతం మీద ఒప్పుకున్నాను. సినిమా రిలీజ్ అయ్యాక మిక్స్‌డ్ టాక్ రావడం కాస్త ఇబ్బందిగా అనిపించింది. అదే సమయంలో వెంకటేష్ ఫోన్ చేసి సినిమా భలేగా ఉందండి. నామీద తీస్తే ఇంకా బాగా ఆడేది అనేశాడు. ఈ కథ నీకే బాగుంటుందని నేను ముందే చెప్పాను. కానీ డైరెక్టర్, రైటర్ వినలేదు' అని ఆయనతో అన్నాను' అని చెప్పుకొచ్చారు చిరంజీవి.



# మహానటితో లిప్‌లాక్?..



'నేను శైలజ'తో టాలీవుడ్‌లోకి అడుగుపెట్టి, 'మహానటి'తో జాతీయ ఉత్తమ నటి అవార్డు దక్కించుకున్న కీర్తి సురేష్ తెలుగులో మళ్లీ బిజీ అవుతోంది. బాలీవుడ్‌లో 'బేబీ జాన్' సినిమాలో గ్లామరస్ లుక్‌లో కనిపించిన కీర్తి సురేష్ తాజాగా విజయ్ దేవరకొండతో కలిసి 'రౌడీ జనార్ధన్' అనే సినిమాలో నటించనుందని సమాచారం. ఈ మూవీలో తొలిసారి కీర్తి లిప్‌లాక్ చేయనున్నట్లు వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. పెళ్లి తర్వాత కీర్తిలో వచ్చిన గ్లామర్ ట్రాన్స్ఫర్మేషన్ టాలీవుడ్‌లో హీట్ పెంచుతోంది.

'నేను శైలజ' మూవీతో తెలుగులో ఎంట్రీ ఇచ్చి స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది మలయాళ బ్యూటీ కీర్తిసురేష్. 'మహానటి'లో అచ్చం సావిత్రిలా నటించి ఏకంగా జాతీయ ఉత్తమ నటి అయిపోయింది. ఎన్ని భాషల్లో, ఎన్ని సినిమాలు చేసినా ఆమె కెరీర్లో 'మహానటి' ఓ అద్భుత సినిమాగా మిగిలిపోయింది. అందుకే తెలుగు ప్రేక్షకులు ఆమెను 'మహానటి' అనే పిలుస్తూ ఉంటారు. ఈ మధ్య తెలుగులో కాస్త గ్యాప్ ఇచ్చిన కీర్తి సురేష్ గతేడాది వివాహం బంధంలోకి అడుగుపెట్టింది. అలాగే బాలీవుడ్‌లో 'బేబీ జాన్' చిత్రంతో ఎంట్రీ ఇచ్చిన కీర్తి.. ఈ మధ్య తనలోని మరో కోణాన్ని బయటపెట్టింది. ఈ సినిమా డిజాస్టర్ అయినా తన గ్లామర్‌తో నార్త్ ప్రేక్షకుల్ని బాగానే ఎంటర్‌టైన్ చేసింది.

ఈ మధ్య టాలీవుడ్‌పై ఫోకస్ పెట్టిన కీర్తి వరుస ప్రాజెక్టులు సైన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ పక్కన 'రౌడీ జనార్ధన్' సినిమాలో ఛాన్స్ కొట్టేసినట్లు సమాచారం. 'రాజావారు రాణిగారు' ఫేమ్ రవికిరణ్ కోలా దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రానికి దిల్ రాజు నిర్మాత. ఈ మూవీలో కీర్తి సురేష్ చాలా గ్లామరస్‌గా కనిపించబోతోందట. విజయ్ దేవరకొండతో ఏకంగా లిప్‌లాక్ కూడా చేయనుందని టాక్. ఇప్పటివరకు కీర్తిసురేష్ ఏ హీరోతోనూ లిప్‌లాక్ చేయలేదు. 'సర్కారు వారి పాట'లో మహేశ్‌బాబుతో రొమాంటిక్ సన్నివేశాల్లో నటించినా లిప్‌లాక్ జోలికి వెళ్లలేదు. తొలిసారి విజయ్ దేవరకొండతో పెదవులు కలపబోతున్నట్లు వార్తలు రావడంతో అప్పుడే 'రౌడీ జనార్ధన్'పై అంచనాలు పెరిగిపోయాయి. ఈ వార్త తెలిసిన ప్రేక్షకులు పెళ్లి తర్వాత కీర్తి సురేష్ బాగా మారిపోయిందంటున్నారు.

బాలీవుడ్‌లో 'బేబీ జాన్' తర్వాత రాకింగ్ స్టార్ రణబీర్ కపూర్ పక్కన కీర్తి ఛాన్స్ కొట్టేసినట్లు ప్రచారం జరుగుతోంది. రొమాంటిక్ లవ్ స్టోరీగా తెరకెక్కే ఈ మూవీలో కీర్తి సురేష్ ఫుల్ గ్లామరస్‌గా కనిపించనున్నదట. అయితే ప్రస్తుతం రామాయణ, లవ్ అండ్ వార్‌బీ యానిమల్ పార్క్ వంటి చిత్రాలతో రణబీర్ బిజీగా ఉండటంతో ఈ ప్రాజెక్టు ఎప్పుడు పట్టాలెక్కుతుందో క్లారిటీ లేదు. ఇక తెలుగులో సుహాస్ పక్కన 'ఉప్పు కప్పురంబు' మూవీ చేస్తోంది. సాధారణంగా హీరోయిన్లు తొలినాళ్లలో గ్లామర్ పాత్రలు చేసి పెళ్లి తర్వాత పద్ధతైన పాత్రలు చేయడానికి మొగ్గుచూపుతుంటారు. అయితే కీర్తి సురేష్ మాత్రం ముందు చాలా పద్ధతిగా నటించి పెళ్లి తర్వాత మాత్రం గ్లామర్ పాత్రలు, లిప్‌లాక్‌లతో రెచ్చిపోతుండటం విశేషం. ఆమెలో వచ్చిన ఈ మార్పు ఇంకెన్ని ఛాన్సులు తెచ్చిపెడుతుందో చూడాలి.



# ట్రాన్స్‌జెండర్‌గా శింబు..

నటుడు, నిర్మాత, డైరెక్టర్‌గా ఎన్నో అద్భుతమైన సినిమాలు తీసి తమిళ సినీ ఇండస్ట్రీలో లెజెండ్‌గా పేరు తెచ్చుకున్న టి.రాజేందర్ వారసుడిగా సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చాడు శింబు. ఆయన అసలు పేరు సిలంబరసన్ థెసింగు రాజేంద్ర. 'మన్మథ' మూవీతో తెలుగులోనూ క్రేజ్ తెచ్చుకున్న ఈ హీరో తర్వాత ఆ టెంపో మెయిన్‌టైన్ చేయలేకపోయాడు. హీరోయిన్లతో లవ్ అఫైర్లు, సెట్లో డైరెక్టర్లతో గొడవలు వంటి ఘటనలు శింబు ఇమేజ్‌ని క్రమంగా తగ్గించేశాయి. తాజాగా మణిరత్నం డైరెక్షన్లో తెరకెక్కిన 'థగ్ లైఫ్'లో నటించారు. ఈ మూవీ జూన్ 5న విడుదల కానుంది. తాజా సమాచారం ప్రకారం.. దీనికి 'కన్నుమ్ కన్నుమ్ కొల్లయ్యదితాల్' ఫేమ్ డైరెక్టర్ కాగా.. యువన్ శంకర్ రాజా మ్యూజిక్ అందిస్తున్నారు. 'థగ్ లైఫ్' ప్రమోషన్లో బిజీగా ఉన్న శింబు తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఈ మూవీకి సంబంధించి ఓ ఆసక్తికరమైన విషయం వెల్లడించాడు. 50' మూవీలో తాను ట్రాన్స్‌జెండర్ పాత్ర పోషించనున్నాడట. ఈ విషయాన్ని శింబునే స్వయంగా తెలిపాడు. ఇందులో చాలా విభిన్న పాత్రలు ఉండగా తాను మాత్రం ట్రాన్స్‌జెండర్ పాత్రని ఎంచుకున్నానని వెల్లడించాడు.



మణిరత్నం డైరెక్షన్లో తెరకెక్కిన 'థగ్ లైఫ్' శింబుకి 48వ చిత్రం. ఇందులో పవర్‌ఫుల్ రోల్‌లో కనిపించనున్న శింబు.. విశ్వనటుడు కమల్ హాసన్‌తో స్క్రీన్ షేర్ చేసుకుంటున్నాడు. ఇటీవలే విడుదలైన ట్రైలర్ సినిమాపై అంచనాలు భారీగా పెంచేసింది. దాని తర్వాత 50వ చిత్రం ప్రారంభం కానుంది. ట్రాన్స్‌జెండర్ పాత్ర ద్వారా తనలోని నట విశ్వరూపాన్ని చూపించడానికి శింబు సిద్ధమవుతున్నాడని అతడి ఫ్యాన్స్ చెబుతున్నారు.

ఇటీవల ఓ ఇంటర్వ్యూలో శింబు మాట్లాడుతూ.. లెజెండరీ డైరెక్టర్ మణిరత్నం తనను పూర్తిగా మార్చేశారని తెలిపాడు. 'రేపు ఏ సీన్ తీయాలో మణిరత్నం ముందురోజే ప్లాన్ చేసుకుంటారు. షూటింగ్ సమయంలో చిన్న కన్ఫ్యూజన్ కూడా ఉండదు. యాక్టర్స్ ఎంత దూరంలో ఉన్నా వాళ్ల దగ్గరికి వెళ్లి కథ చెబుతారు. నేను పెద్ద డైరెక్టర్‌ని అన్న అహం ఆయనలో కాస్తయినా కనిపించదు. ఆయన్ని చూసి నేను చాలా నేర్చుకున్నాను. ఆయనలా క్రమశిక్షణ ఉంటే నేను చాలా పెద్ద నటుడిని అయ్యేవాడిని. ఆయన నా జీవితాన్ని మార్చిన గొప్పవ్యక్తి. భవిష్యత్తులో ఆయనతో ఎన్ని సినిమాల్లో అయినా నటించేందుకు సిద్ధంగా ఉన్నా' అంటూ చెప్పుకొచ్చాడు శింబు.

# థగ్ లైఫ్ కోసం...

థగ్ లైఫ్ కోసం శ్రుతి హాసన్ రంగంలోకి దిగినట్టుగా సమాచారం. ఏ ఆర్ రెహమాన్ కంపోజ్ చేసిన పాటను శ్రుతి హాసన్ పాడిందని అంటున్నారు. నేడే థగ్ లైఫ్ ఆడియో లాంచ్ ఈవెంట్ గ్రాండ్‌గా జరగబోతోంది. ఇందులో శ్రుతి హాసన్ లైవ్ పర్ఫామెన్స్ ఇస్తుందేమో చూడాలి. ఇక ఏ ఆర్ రెహమాన్ పర్ఫామెన్స్ ఈ ఈవెంట్‌కు హైలెట్ అయ్యేలా ఉంది. థగ్ లైఫ్ చిత్రం జూన్ 5న రాబోతోన్న సంగతి తెలిసిందే.

కమల్ హాసన్ హీరోగా మణిరత్నం దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'థగ్ లైఫ్'. ఈ మూవీ జూన్ 5న రిలీజ్ కాబోతోంది. ఈ మేరకు ప్రమోషన్స్ కూడా పెంచేశారు. ఇప్పటి వరకు రిలీజ్ చేసిన పాటలు, టీజర్, ట్రైలర్ అన్నీ కూడా జనాల్లో ఇంట్రెస్ట్ క్రియేట్ చేశాయి. ఇక నేడు చెన్నైలో థగ్ లైఫ్ ఆడియో లాంచ్ ఈవెంట్‌ను గ్రాండ్‌గా నిర్వహించబోతోన్నారు. ఆ కార్యక్రమంలో ఏ ఆర్ రెహమాన్ లైవ్ పర్ఫామెన్స్ ఉంటుందని సమాచారం. ఇక ఏ ఆర్ రెహమాన్ ఫ్యాన్స్ అందరికీ ఐ ఫీస్ట్‌లా ఈ ఈవెంట్ ఉంటుందని తెలుస్తోంది.

ఇప్పటికే తెలుగులోనూ థగ్ లైఫ్ మీద బజ్‌ను పెంచేశారు. రీసెంట్‌గా జరిగిన థగ్ లైఫ్ మీడియా మీట్‌లో కమల్ హాసన్ ఇచ్చిన స్పీచ్, మణిరత్నం మాట్లాడిన మాటలు, సుహాసిని ఫన్నీ స్పీచ్ ఇలా అన్నీ బాగానే వైరల్ అయ్యాయి. ఇక రీసెంట్‌గా రిలీజ్ చేసిన షుగర్ బేబీ సాంగ్, అందులో త్రిషను చూపించిన తీరు, హాట్ లుక్‌లో త్రిష కనిపించడంతో నెటిజన్ల హార్ట్ బీట్ పెరిగిపోయింది. జింగుచా అనే పాట కూడా బాగానే క్లిక్ అయింది.

థగ్ లైఫ్ ట్రైలర్‌లో ఏఆర్ రెహమాన్ ఇచ్చిన బీజీఎం కూడా అందరినీ ఆకట్టుకుంది. మళ్లీ రెహమాన్ కమ్ బ్యాక్ ఇచ్చాడు అని అంతా ఫిక్స్ అయిపోయారు. మణిరత్నం, కమల్ హాసన్, రెహమాన్ వంటి దిగ్గజాలు కలిస్తే ఎలాంటి అవుట్ పుట్ వస్తుందో అలాంటి అవుట్ పుట్ వచ్చిందని జనాలు కామెంట్లు చేస్తూనే ఉన్నారు. థగ్ లైఫ్ మీద ఇప్పుడు కోలీవుడ్, టాలీవుడ్ సర్కిళ్లలో మంచి డిమాండ్ అయితే ఏర్పడింది.

ఇక నేడు జరిగే ఆడియో లాంచ్‌లో శ్రుతి హాసన్ పాడిన పాటను కూడా రిలీజ్ చేస్తారట. ఆ పాటను మళ్లీ స్టేజ్ మీద శ్రుతి హాసన్ పాడుతుందని సమాచారం. ఆ పాటే సినిమాకు హైలెట్ అవుతుందని చెబుతున్నారు. విన్వేలి నాయగన్ అంటూ వచ్చే పాటను శ్రుతి హాసన్ ఆలపించిందని సమాచారం. మరి ఈ పాట తెరపై ఎలా ఉంటుందో చూడాలి. ఇక ఈ చిత్రంలో శింబు పాత్ర సర్ ప్రైజింగ్‌గా ఉంటుందని అర్థం అవుతోంది. అభిరామి, త్రిషలతో కమల్ రొమాన్స్ మీద ఆల్రెడీ చర్చలు స్టార్ట్ అయ్యాయి. జోజు జార్జ్, అశోక్ సెల్వన్, నాజర్, తణికెళ్ల భరణి వంటి వారి కారెక్టర్స్ ఎలాంటి ఇంపాక్ట్‌ను క్రియేట్ చేస్తాయో చూడాలి. మరి ఇండియన్ 2 ఫ్లాప్‌ను కమల్ ఈ మూవీతో అధిగమిస్తాడో లేదో చూడాలి.

# థియేటర్ల బంద్.. ఫిల్మ్ ఛాంబర్ క్లారిటీ



టాలీవుడ్‌లో థియేటర్స్ వివాదం నెలకొన్న సంగతి తెలిసిందే. రెంటల్ విధానానికి బదులు పర్సెంటేజీల సిస్టమ్ తీసురావాలనే డిమాండ్ తో ఈ వివాదం మొదలైంది. గత కొన్ని రోజులుగా ఇదే అంశం మీద డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లు, నిర్మాతల మధ్య చర్చలు జరుగుతున్నాయి. మల్టీప్లెక్స్‌లకు ఇస్తున్నట్లే సింగిల్ స్క్రీన్ థియేటర్లలోనూ పర్సంటేజ్ విధానాన్నే అమలు చేయాలని తెలుగు రాష్ట్రాల ఎగ్జిబిటర్లు పట్టుబడుతున్నారు. లేదంటే జూన్ 1వ తేదీ నుంచి థియేటర్లు బంద్ చేస్తారని వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో హైదరాబాద్ లోని ఫిల్మ్ ఛాంబర్ లో శనివారం మీటింగ్ జరిగింది. ఈ సందర్భంగా థియేటర్ల స్ట్రైక్ పై క్లారిటీ ఇచ్చారు.

థియేటర్ల వివాదంపై చర్చించడానికి ఫిల్మ్‌ఛాంబర్‌లో ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లతో తెలుగు సినీ నిర్మాతలు సమావేశమయ్యారు. దిల్ రాజు, ఏఎం రత్నం, ఎస్. నాగవంశీ, సురేష్ బాబు, మైత్రీ రవి, సి. కళ్యాణ్, ఎన్వీ ప్రసాద్ సహా పలువురు నిర్మాతలు, పంపిణీదారులు, థియేటర్ యాజమాన్యాలు ఈ మీటింగ్ కి హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. మీటింగ్ అనంతరం ఫిల్మ్ ఛాంబర్ కార్యదర్శి దామోదర ప్రసాద్ మాట్లాడుతూ.. తెలుగు రాష్ట్రాల్లో జూన్ 1వతేదీ నుంచి సినిమా థియేటర్ల బంద్ ఏమీ ఉండదని ప్రకటించారు.

థియేటర్స్ బంద్ అనేది తప్పుగా చిత్రీకరించారని దామోదర ప్రసాద్ అన్నారు. చర్చలు జరగకపోతే జూన్ 1వ తేదీ నుంచి బంద్ నిర్ణయం తీసుకోవాల్సి వస్తుందనేది మాత్రమే నిజం అని, కానీ అందరూ థియేటర్లు మూసి వేస్తారన్న సమాచారాన్నే ప్రచారం చేశారన్నారు. ప్రస్తుతానికి బంద్ ఏమీ లేదని తెలిపారు. కేవలం ఒక్క సినిమాను దృష్టిలో పెట్టుకుని థియేటర్లను బంద్ చేస్తున్నామనడం సరికాదని దామోదర ప్రసాద్ అన్నారు. థియేటర్ల బంద్ ప్రచారాన్ని ఎవరూ నమ్మొద్దని, తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ప్రతినిధుల నుంచి వచ్చే అధికారిక సమాచారం మాత్రమే పరిగణలోకి తీసుకోవాలని సూచించారు. కేఎల్ దామోదర్ ప్రసాద్ మాట్లాడుతూ.. "ఇటీవల వినిపిస్తున్న కొన్ని వార్తలను బేస్ చేసుకుని ఈ మీటింగ్ పెట్టడం జరిగింది. రెండు తెలుగు రాష్ట్రాల నిర్మాతలు, ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లు హాజరయ్యారు. ప్రస్తుతం థియేటర్ల పరిస్థితిపై ఉన్న కొన్ని సమస్యల గురించి చర్చలు జరగాయి. మే 1వ తేదీ నుండి థియేటర్లు మూతపడతాయని వార్త బయటకు వెళ్ళింది. కానీ థియేటర్లు మూసి వేయడం అనేది జరగడం లేదు. అది పూర్తిగా ఊహాగానం మాత్రమే. ఈనెల 30వ తేదీన ఈసీ మీటింగ్ జరగనుంది. ఆరోజు మూడు సెక్టార్లకు నుండి ఒక కమిటీ నిర్మించబోతున్నాము. ఓ నిర్ణీత సమయంలోనే ఈ సమస్యకు పరిష్కారం వచ్చేలా ఆ కమిటీ పని చేయబోతుంది" అని తెలిపారు.

"ఫిలిం ఛాంబర్, అనుసంధాన సంస్థల నుండి వచ్చే వార్తలను మాత్రమే ప్రచారం చేయండి. అంతేకానీ బయట నుండి వచ్చే వేరే ఇతర వార్తలను దయచేసి నమ్మకండి.. ఎందుకంటే అలాంటి తప్పుడు వార్తలు చిత్ర పరిశ్రమలో అనవసరమైన ఆటంకాలు తీసుకొస్తు న్నాయి. ఈ విషయంపై అవసరమైతే ప్రభుత్వంతో కూడా మాట్లాడతాము. గతంలో కూడా కొన్ని సమస్యలకు ప్రభుత్వంతో కూర్చుని చర్చించాం. అదేవిధంగా ఇప్పుడు కూడా చర్చిస్తాం. ఏదో ఒక్క సినిమాను టార్గెట్ చేసి థియేటర్లు బంద్ చేస్తున్నారు అనే వార్తను పూర్తిగా ఖండిస్తున్నాం. ఇండస్ట్రీకి మంచి జరిగే విధంగానే ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా ఈ సమస్యలు పరిష్కరించేలా ముందుకు సాగుతాం" అని కేఎల్ దామోదర్ ప్రసాద్ చెప్పుకొచ్చారు.